క్లుప్తంగా

నేడు కరెంట్ సరఫరాలో అంతరాయం

నర్సాపూర్: ఈనెల 18న పలు సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంట్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని మండల ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. నర్సాపూర్ మండలంలోని ఆవంచ, కాగజ్‌మద్దూర్ సబ్ స్టేషన్ల పరిధిలో ఈనెల 18న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని చెప్పారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని నస్తిపూర్, హత్నూర, రెడ్డిఖానాపూర్, కొన్యాల సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం కరెంట్ సరఫరా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉండదన్నారు. సబ్ స్టేషన్లలో మెయింటనెన్స్ పనులు చేపడుతున్నందున కరెంట్‌సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందిస్తున్న సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): అన్ని వర్గాల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను హైదరాబాదులోని ఆమె నివాసంలో అందజేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్యం కోసం ప్రభుత్వం ఇస్తున్న సహాయం ఎంతో గొప్పదన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న విశ్రాంతి ఉద్యోగులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగులకు అన్ని ఈహెచ్ఎస్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందించాలని మండల ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పిట్ల శంకరయ్య అన్నారు. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన విశ్రాంతి ఉద్యోగి లింగోజి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన కరువు భత్యం వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

నేడు యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతరాజ్ రమణ హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

మొక్కజొన్న పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న సతీశ్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని వెంకటాపూర్(కె) గ్రామంలో మంగళవారం వరి మాగానుల్లో సాగు చేసిన జీరో టిల్లేజ్ మొక్కజొన్న పంటను మండల వ్యవసాయ అధికారి సతీశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి మాగానుల్లో మొక్కజొన్న పంటను నవంబర్, డిసెంబర్ నెలలో వరి కోతల అనంతరం ఒక తేలికపాటి తడి ఇచ్చి మొక్కజొన్న పంటను తాడును ఉపయోగించి 60×20 సెంటీమీటర్ దూరంతో విత్తుకోవాలని తెలిపారు. ఈ విధంగా విత్తుకోవడం వలన దుక్కి దున్నే, కూలీల ఖర్చులు తగ్గుతాయని తక్కువ నీటితో ఎక్కువ పంటను సాగు చేయవచ్చని, తక్కువ సమయంలో అధిక దిగుబడి సాధించవచ్చున్నారు. అలాగే మిగిలిపోయిన వరిగడ్డి కూడా నేలలో కలిసి నేలలో సేంద్రియ పదార్థం పెంపొందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిల్ కుమార్, ఏఈఓ శ్రీలత,, రైతులు దయాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



నర్సాపూర్: మాట్లాడుతున్న సునీతారెడ్డి

నర్సాపూర్: అంధత్వ నివారణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి అన్నారు. ఆమె మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... ఈనెల 18న సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అనంతరం రాష్ట్ర మంతటా అమలు చేస్తారని చెప్పారు. ప్రజలందరికీ ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి కళ్ల అద్దాలు, కంటి ఆపరేషన్లు చేసి అంధత్వ నివారణ కోసం సీఎం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించారని తెలిపారు. కాగా సీఎం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారని వివరించారు. గ్రామాల వారీగా కంటి వెలుగును అమలు చేసే షెడ్యూల్‌ను వైద్య శాఖ అధికారులు ఇప్పటికే ఖరారు చేశారన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఈనెల 19 నుంచి కంటి పరీక్షలు చేస్తారని ఆయన చెప్పారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను వైద్య శాఖ అధికారులు చేశారన్నారు.

కంటి వెలుగు నిర్వహణపై సమీక్ష

మున్సిపాలిటీ పరిధిలో కంటివెలుగు కార్యక్రమం నిర్వహించేందుకు మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్‌గోపాల్ మంగళవారం కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలోని స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, మెప్మా సిబ్బంది, ఆరోగ్య శాఖ ఉద్యోగులు, ఆశ వర్కర్లు కౌన్సిలర్లతో సమన్వయం చేసుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పెద్దశంకరంపేట(మెదక్): నేటి నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా, వైద్యురాలు సారిక అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటతో పాటు సంగారెడ్డిపేటలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అనువైన భవనాలను పరిశీలించారు. ప్రతీరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు కంటి వెలుగు శిబిరాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీణసు భాష్‌గౌడ్, ఎంపీఓ రియాజుద్దీన్, వైద్య సిబ్బంది యాదయ్య, సాయిలు, కార్యదర్శి వెంకట్రాములు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాజిరెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాల ఆవరణలో కంటి వెలుగు సన్నద్ధత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సాయి సింధూ, పీహెచ్ఓ యాదగిరిరావు, సూపర్‌వైజర్ శాంతిశ్రీ, ఉపసర్పంచ్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నంది గామ గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం ఇన్‌చార్జ్ డీపీఓ రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఎంపీఓ రాజేందర్, ఎంపీటీసీ సురేష్, గ్రామ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్, ఏఎన్ఎం సలోని, ఆశ వర్కర్ గౌరీ తదితరులు పాల్గొన్నారు.



తూప్రాన్: ఏర్పాట్లను పరిశీలిస్తున్న 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి

తూప్రాన్: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి అన్నారు. మున్సిపల్ కేంద్రంలో ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోహన్, చైర్మన్ రవీందర్‌గౌడ్, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ జ్యోతి స్మృతి, సీహెచ్ఓ బాలనర్సయ్య, కంటి వెలుగు స్పెషల్ ఆఫీసర్ కృష్ణ మూర్తి, కంటి వెలుగు డాక్టర్ ప్రవంతి, సిబ్బంది దుర్గారెడ్డి, రేణుకా, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



చిన్నశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న సర్పంచ్ రాజిరెడ్డి



నిజాంపేట(మెదక్): కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీపీఓ రాజేంద్రప్రసాద్

ఇంటి పన్నులను తగ్గించాలి



మున్సిపల్ కమిషనర్‌తో వాగ్వాదం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కార్యకర్తలు మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అమాంతం పెంచిన ఇంటి పన్నులతో నిరుపేదలు ఇబ్బందులపాలవుతున్నారని, అడ్డగోలుగా పెంచిన పన్నులను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు కార్యాలయంలోకి వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ యాదగిరిని అడ్డగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. పన్నులు తగ్గించే విషయమై అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఎంతమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనికి తోడు పట్టణంలో అభివృద్ధి అడుగంటిందని, మున్సిపాలిటీ అభివృద్ధి విషయమై ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. పెంచిన బిల్లులను తగ్గించే విషయమై 15 రోజుల్లోపు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీఇవ్వగా, వారు శాంతించారు. ఇకనైనా చర్యలు తీసుకోకపోతే పట్టణ ప్రజలతో కలిసి జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి నరేందర్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోచమ్మల అశ్విని, ఇతర నాయకులు లావణ్య, సిద్ధరాంలు, సతీశ్, గిరి, తదితరలు పాల్గొన్నారు.

ఆకుకూరలతో రక్తహీనత దూరం

- ఐసీడీఎస్ శివ్వంపేట సెక్టార్ సూపర్‌వైజర్ సంతోష
- అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



సూచనలు చేస్తున్న సూపర్‌వైజర్ సంతోష

శివ్వంపేట(నర్సాపూర్): మహిళలు ప్రతీరోజు ఆహారంలో ఆకుకూరలు తింటే రక్తహీనత దూరం అవుతుందని ఐసీడీఎస్ శివ్వంపేట సెక్టార్ సూపర్‌వైజర్ సంతోష తెలిపారు. మంగళవారం మండలంలోని మాల్యతండా, రెడ్యతండా అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో పిల్లలు, తల్లుల హాజరు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. అనంతరం మాల్యతండాలో గృహసందర్శణ నిర్వహించి, గుర్భిణులు, బాలింతల ఇంటికి వెళ్లి ఆరోగ్య విషయాలు తెలిపారు. అలాగే మండలంలోని రెడ్యా తండా, మాల్య తండా అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు రక్తహీనతను నివారించేందుకు ఆకుకూరలు మునగాకు, పాలకూర, బచ్చలి, ఇతర అకుకూరలు అధికంగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పిల్లలకు ముర్రుపాలు తాగించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కిచన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రేన, రేణుక, తల్లులు పాల్గొన్నారు.

టేక్మాల్ ఎంపీడీఓగా భారతి



టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ ఎంపీడీఓగా భారతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు కౌడిపల్లిలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన ఆమె టేక్మాల్ ఎంపీడీఓగా బదిలీపై వచ్చినట్లు తెలిపారు. టేక్మాల్ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించిన లక్ష్మి మెదక్ జిల్లా కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భారతి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అందరికి వర్తించేలా కృషి చేస్తామని, మండల అభివృద్ధికి బాధ్యతగా విధులు నిర్వహిస్తామన్నారు. అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని గజ్వేల్ ఎస్ఐ శంకర్ పేర్కొన్నారు. 33వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆర్‌బీఎల్(రాణే బ్రేక్ లైనింగ్స్ లిమిటెడ్) ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద వాహనదారులకు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారముందన్నారు. కార్యక్రమంలో జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ, ఆర్‌బీఎల్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): యువకుల కోసం క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని యువకులు గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండలంలోని కూచారం గ్రామానికి చెందిన నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు గ్రామ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డికి గ్రామ పంచాయతీలో వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. మండలంలో అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కానీ తమ గ్రామంలో ఏర్పాటు చేయలేదని, ఇకనైనా దృష్టి సారించి ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. అంతే కాకుండా పరిశ్రమల వాడకు వెళ్లి వాహనాలు గ్రామంలోంచి వెళ్తుడటంతో రోడ్లు, చెట్లు ధ్వంసమవుతున్నాయని, వాహన రాకపోకలను అడ్డుకోవాలని కోరారు.

ముగిసిన రామలింగేశ్వర జాతర

ఘనంగా రథోత్సవం



రామలింగేశ్వర స్వామి రథోత్సవంలో భక్తులు

తూప్రాన్: మండలంలోని ఇస్లాంపూర్ గ్రామ సమీపంలోని శ్రీరామలింగేశ్వర ఉత్సవాలు మంగళవారం రథోత్సవంతో ముగిశాయి. ఈ వేడుకలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం గణపతి పూజ, అభిషేకం, అర్చన చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా తయారు చేసిన రథంపై ఊరేగించారు. భక్తులకు ఆలయ అర్చకుడు ఆత్రేయ శర్మ తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకల్లో సర్పంచ్ సుకన్య, ఆలయ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, నాయకులు సంతోశ్‌రెడ్డి, రమేశ్, నర్సింలు, మహిపాల్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మురుగుకాల్వను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బస్తీబాట

మున్సిపాలిటీలో పర్యటించిన పాలకవర్గం

రామాయంపేట(మెదక్): బస్తీబాట కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, కౌన్సిలర్లు, పలు శాఖల అధికారులు మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామం (ఏడో వార్డు) లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో నెలకొన్న సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లతో పాటు మురుగు కాల్వలను పరిశీలించారు. అర్హులైవారందరికీ పింఛన్లు ఇప్పించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా చైర్మన్ హామీ ఇచ్చారు. గ్రామంలో అంధత్వంతో బాధపడుతున్న వారు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన వారికి కంటి అద్దాలతో పాటు మందులు ఉచితంగా అందజేస్తారని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను గ్రామస్తులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని ఈ సందర్భంగా చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు బొర్ర అనిల్‌కుమార్, చిలుక గంగాధర్, సుందర్‌సింగ్, దేమె యాదగిరి, మల్యాల కవిత, ఇతర నాయకులు దేవుని రాజు, శ్యాం, మల్యాల కిషన్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

సహజ ఎరువులనే వాడాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాంప్రసాద్



చేగుంట(తూప్రాన్): నాట్లు పరిశీలిస్తున్న వసంతసుగుణ

ఏడీఏ రాం ప్రసాద్

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని రైతులు రసాయనిక ఎరువులకు బదులుగా సహజ ఎరువులనే వాడాలని పెద్దశంకరంపేట ఏడీఏ రాం ప్రసాద్ తెలిపారు. మంగళవారం టేక్మాల్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో భాస్వరం కరిగించే జీవన ఎరువుపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పంటకు కావాల్సిన వివిధ పోషకాల్ల భాస్వరం చాలా ముఖ్యమైందని, పోషకం వేర్ల పెరుగుదలకు చాలా అవసరమన్నారు. భాస్వరం భూమిలో వేసినప్పుడు త్వరగా పంటకు లభ్యంకాని రూపంలోకి మారిపోతుందని, 2 కిలోల లేదా 200 మీ. లీ భాస్వరం కరిగించే బ్యాక్టీరియా అనే జీవన ఎరువును 200కిలోల పశువుల ఎరువుతో కలిపి చల్లుకోవాలని సూచించారు. రైతులు విచక్షణ రహితంగా రసాయన ఎరువులు వాడకూడదని తెలిపారు. వరిని వేదజల్లే పద్ధతిలో విత్తనం 8-10 కిలోల అవసరం దీని ద్వారా విత్తన మోతాదు తక్కువ, కూలీల సమస్యను అధిగమించవచ్చునన్నారు. సరైన సమయంలో పంటను విత్తుకోవచ్చని, వారం, పది రోజులు ముందుగానే పంట కోతకు వస్తుందని తెలిపారు. పంట సాగులో ఖర్చు కూడా కొంత మేరకు తగ్గించుకోవచ్చునన్నారు. రైతులు అధికారుల సూచనల మేరకు పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఇందులో ఉపసర్పంచ్ నాగరాజు, ఏఈఓ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

చేగుంట(తూప్రాన్): వరి పంటలకు జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలని వ్యవసాయ శాఖ ఏడీఏ వసంతసుగుణ అన్నారు. మండలంలోని బోనాల్ గ్రామంలో మంగళవారం వ్యవసాయ పొలాలను వసంతసుగుణ సందర్శించి, రైతు వేదికలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. నారు మడుల్లో మొగిపురుగు నివారణ, వరి పంటలకు ప్రస్తుతం వచ్చే తెగుళ్ల నివారణ పద్ధతులు వివరించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, జీవన ఎరువులు ట్రైకోడర్మా, విరిడే, అజటో వంటి జీవన ఎరువులను వాడుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచు మల్లయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్, ఉపసర్పంచ్ ఎల్లం, రైతుబంధు కోఆర్డినేటర్ రాజయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



నల్లపోచమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శ్రీ శీతలమాత(నల్లపోచమ్మ) దేవాలయ 7వ వార్షికోత్సవానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఉత్సవాలు ఈనెల 18 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు దండు దశరథ, రమణరావు, గోవర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్, శ్రీనివాస్‌రావు తదితరులు చెప్పారు. ఈనెల 18న ఆలయంలో లక్ష పుష్పార్చన, అమ్మవారి ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈనెల 19న చండీయాగం, అమ్మవారికి సామూహిక బోనాలు సమర్పణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని వారు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కాగా ఉత్సవాల్లో భాగంగా ఆలయం చుట్టూ విద్యుత్ లైట్లతో ఆలయాన్ని అలంకరించడం తదితర ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు. కాగా రెండు రోజుల పాటు ఆలయం వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు భోజన వసతి ఉంటుందని, పట్టణానికి చెందిన వ్యాపారి శ్రీధర్‌గుప్తా సహకారంతో భోజన వసతి కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

విజేతలకు బహుమతుల అందజేత



ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని రంగంపేటలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రంగంపేట ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. విజేతలకు బహుమతులు అందజేసేందుకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు మహిళా కమిషన్ చైర్మన్ సునీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫైనల్‌లో మద్దెల సాయి, ఉసికె రాజు టీంలు పోటీ పడగా, మద్దెల సాయి టీం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విజేత, రన్నర్ టీంలకు ట్రోఫీతో పాటు నగదును అందజేశారు. దీంతో పాటు ఈ కార్యక్రమంలోనే సునీతారెడ్డి వాకిటి లక్ష్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ మాధవి రాజాగౌడ్, ఎంపీపీ జెడ్పీటీసీ మంజుల, మేఘమాల, ఎనగండ్ల, బుజరంపేట గ్రామ సర్పంచ్‌లు వీరారెడ్డి, శ్యామ్, రంగంపేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ మల్లేశం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కృష్ణ, సత్యం గౌడ్, శేఖర్, దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని దళితుల డిమాండ్



నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ప్రతిని చూపుతున్న దళితులు

నర్సాపూర్‌రూరల్: దళితుల శ్మశాన వాటికను ఆక్రమించి, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసిన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని మండలంలోని సీతారాంపూర్ గ్రామ దళితులు డిమాండ్ చేశారు. మంగళవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామ దళితులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా తాత ముత్తాతల కాలం నుంచి నిర్వహిస్తున్న ఎస్సీ మాల కులస్తుల శ్మశాన వాటికను ఆక్రమించి, అందులో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. గ్రామ సర్పంచ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓలతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు దళితులు చెప్పారు.